క్లుప్తంగా

పౌర్ణమి పూజలు


కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కడప కల్చరల్‌ : స్థానిక శ్రీ విజయదుర్గా దేవి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి తెల్లవారు జామున పుణ్యనదీజలాలు నింపిన తొమ్మిది కలశాలతో నవకలశస్నపనం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు చండీహోమం నిర్వహించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులచే 108 దీపాలతో దీపాలంకార సేవ, 8 గంటలకు అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు.

ఆర్‌ఐఓకి వినతి

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లాలోని పొద్దుటూరు పట్టణం ఎర్రగుంట్ల బైపాస్‌ మోడంపల్లిలో ప్రభుత్వ అనుమతి లేకుండా తరగతులను నిర్వహిస్తున్న ఫేస్‌ జూనియర్‌ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి బ్లాక్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు డిమాండ్‌ చేశారు. ఈ విషయమై గురువారం ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోపీ, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

కడప కల్చరల్‌ : కడప నగరం రహమతుల్లావీధిలోగల చారిత్రాత్మకమైన హజరత్‌ ఖ్వాజా బందా నవాజ్‌ సాహెబ్‌ రహమతుల్లా అలైహి వారి చాంద్‌ ఫిరా గుంబద్‌ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి గంధోత్సవంలో భాగంగా దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుండి ఫకీర్ల మేళ తాళాలతో విన్యాసాలతో గంధం దర్గా వద్దకు చేరి గురువుల మజార్‌ వద్ద సమర్పిస్తామన్నారు. 25వ తేదీన ఉరుసు, 26వ తేదీన తహలీల్‌ ఫాతెహా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ఉరుసు, తహలీల్‌ రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి కచేరీ జరుగుతుందన్నారు.

సరుకులు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం ప్రకాష్‌ నగర్‌ లో నివసిస్తున్న ఓ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో జేబీవీఎస్‌ ది ప్రిజర్వేర్‌ సేవా సమితి ప్రతినిధులు నిత్యావసర సరుకులు అందించి చేయూతనందించారు. సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్‌ మాట్లాడుతూ సహాయ సహకారాలు అందించిన స్రవంతి రెడ్డి, సాయి రాజు, సతీష్‌ రెడ్డి, శ్రీనివాసులు, శైలజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు, సంస్థ సభ్యులు శ్రీను, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ


బాసట చిల్డ్రన్స్‌ హోం పిల్లలకు సరుకులు అందజేస్తున్న విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ రమణ

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలోని బాసట చిల్డ్రన్స్‌ హోంకు కడప విద్యుత్‌ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరఫున రూ. 25 వేలు విలువచేసే నిత్య అవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్‌పీడీసీఎల్‌ పర్యవేక్షక ఇంజినీరు ఎస్‌. రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా సేవ చేసినప్పుడు మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం జనరల్‌ సెక్రెటరీ చలపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ నాయక్‌, లక్ష్మీపతి, అసిస్టెంట్‌ ఇంజనీర్‌ రామక్రిష్ణ, బాసట చిల్డ్రన్‌ హోమ్‌ సభ్యులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలి


నందిమండలంలో వ్యాక్సినేషన్‌ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

పెండ్లిమర్రి : గ్రామాల్లో ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించి వ్యాక్సినేషన్‌ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని నందిమండలం–1 సచివాలయం పరిధిలో గురువారం వేస్తున్న వ్యాక్సినేషన్‌ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి ఈవ్యాక్సిన్‌ వేయాలన్నారు. వ్యాక్సిన్‌ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీని వల్లన టీబీ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ రామప్రతాప్‌, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్లాసిక్‌ గేమ్‌.. బ్యాడ్మింటన్‌..

ప్రపంచవ్యాప్తంగా శరవేగంగా దూసుకువస్తున్న గేమ్‌ బ్యాడ్మింటన్‌... దేశంలో క్రికెట్‌ తర్వాత అత్యంత ఆదరణ కలిగిన ఈ క్రీడ పట్ల చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వయసుల వారు ఆడే క్రీడగా గుర్తింపు పొందింది. ఈ క్రీడ ఆడటం ద్వారా ఆరోగ్యంతో పాటు ఉత్సాహం పొందే అవకాశం ఉండటంతో ఈ క్రీడకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.


బ్యాడ్మింటన్‌ వేసవి శిక్షణ శిబిరంలో మెలకువలు తెలుసుకుంటున్న విద్యార్థులు

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలోని వైఎస్‌ఆర్‌ ఇండోర్‌ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బ్యాడ్మింటన్‌ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. కోచ్‌లు సుదర్శన్‌ సిద్దిఖ్‌, జాకీర్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణకు చిన్నారులు వచ్చి శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ శిబిరంలో చిన్నారులకు ప్రాథమిక అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. రాకెట్‌ పట్టుకునే విధానం మొదలు చిన్నారులకు క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌, రన్నింగ్‌, స్ట్రెచ్చింగ్‌, సర్వీస్‌, ఫుట్‌వర్క్‌, స్మాష్‌, డ్రాప్‌ తదితర అంశాల్లో మెలకువలు నేర్పుతూ భవిష్యత్‌ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు వేదికగా నిలుస్తోంది వేసవి శిక్షణ శిబిరం. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ శిబిరం కొనసాగుతోంది.


బ్యాడ్మింటన్‌ శిబిరంలో చిన్నారులు

సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు..



వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు బ్యాడ్మింటన్‌లో శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ శిబిరం ప్రారంభం నుంచి ఇక్కడికి వస్తున్నా. ఆటలోని ప్రాథమిక అంశాలను నేర్చుకున్నా. బ్యాడ్మింటన్‌ క్రీడాకారుడిగా రాణించాలన్నదే లక్ష్యం.

– శ్రీమన్నారాయణ, 8వ తరగతి కడప

బ్యాడ్మింటన్‌లో రాణించాలని..



బ్యాడ్మింటన్‌ క్రీడాకారునిగా రాణించాలన్నదే నా ఆశయం. అందుకోసం శిక్షణ తీసుకునేందుకు ఇక్కడి వచ్చాను. వేసవి శిక్షణ శిబిరం పూర్తయిన తర్వాత కూడా రెగ్యులర్‌గా వచ్చి సాధన చేస్తా. కోచ్‌ అన్ని విషయాల్లో సహకరిస్తూ మంచి శిక్షణ ఇస్తున్నాడు.

– కె. కౌశిక్‌, 7వ తరగతి, కడప

కొత్త విషయాలు తెలుసుకున్నా..



ఇంటివద్ద మామూలుగా ఆడుకునే వాణ్ణి. వేసవి సెలవులు రావడంతో శిక్షణ శిబిరానికి వచ్చాను. ఇక్కడ చాలా కొత్త విషయాలు తెలియజేశారు. నా ఆటతీరును మెరుగుపరుచుకునేందుకు శిక్షణ ఎంతగానో ఉపకరిస్తోంది. నాకు ఇష్టమైన ఆటను నేర్చుకోవడంతో పాటు సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నా.

– బి. జానకీ నందన్‌, 8వ తరగతి

ఘనంగా అన్నమయ్య జయంతి

కడప సెవెన్‌రోడ్స్‌ / కడప ఎడ్యుకేషన్‌ : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి కార్యక్రమాన్ని గురువారం కడప నగరంలోని జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమునిరెడ్డి, రామ్మూర్తినాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు అజరామరమని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వాసి కావడం మన అదృష్టమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసులు, జిల్లా ట్రెజరర్‌ నగేష్‌, నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, నాగయ్య, బాలసుబ్రమణ్యం, నారాయణ, భాష, శంకరయ్య, రాయుడు తదితరులు పాల్గొన్నారు.


అన్నమాచార్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దు


బలిజపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివశంకర్‌

చింతకొమ్మదిన్నె : జూన్‌ 4న జరగబోయే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌ నాయక్‌ తెలిపారు. గురువారం మండలంలోని మామిళ్ళపల్లి, ఇందిరానగర్‌, నాయనవారిపల్లి, బలిజపల్లి గ్రామాలలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌ పూర్తి అయిన రెండు రోజులపాటు కోడ్‌ అమలులోనే ఉంటుందని ఎన్నికలకు సంబంధించి ఎలాంటి బాణాసంచా కానీ, విజయోత్సవ ర్యాలీలు కానీ నిర్వహించేందుకు వీలు లేదన్నారు. ఎక్కడైనా ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీకేదిన్నె పోలీసులు పాల్గొన్నారు.

విత్తన నమోదు కార్యక్రమం ప్రారంభం

వీరపునాయునిపల్లె : ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందిస్తున్న వేరుశనగ విత్తన నమోదు కార్యక్రమాన్ని మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ప్రారంభించారు. విత్తన నమోదు కార్యక్రమాన్ని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి ఎస్‌.పాలగిరి గ్రామంలో ప్రారంభించారు. వేరుశనగ పంట సాగు చేయు ప్రతి రైతుకు విత్తనాన్ని అందిస్తామన్నారు. రైతు తమ పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, మొబైల్‌ ఫోన్‌ తమ వెంట తీసుకుని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


విత్తన నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

26న సాహిత్య సదస్సు

కడప కల్చరల్‌ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 26న నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు బ్రౌన్‌ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. 132వ ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు రాయలసీమ నదీ సాహిత్యం అనే అంశంపై బ్రౌన్‌ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్‌ చింతకుంట శివారెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు.

వైభవంగా గంధోత్సవం


గురువుల మజార్‌ వద్ద ఫాతెహా నిర్వహిస్తున్న దృశ్యం

కమలాపురం : పట్టణంలో వెలసిన హజరత్‌ షావలి మస్తాన్‌ వలీ సాహెబ్‌ గంధోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ఏ గఫారియా పీఠాధిపతి ఫైజుల్‌ గఫ్ఫార్‌ షా ఖాద్రి చేతుల మీదుగా స్వామి వారి మజార్‌పై గంధాన్ని సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా చేసి ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు.

25న గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్‌

కమలాపురం : పట్టణంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల బాలికా విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్‌ ప్రవేశాలకు ఈనెల 25వ తేదీన కౌన్సిలింగ్‌ జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్‌ తులశమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి గానూ 25వ తేదీ ఉదయం 9 గంటలకు లక్కిరెడ్డిపల్లెలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ గురుకుల పాఠశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు ఆసక్తి కలిగి అర్హత గల విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాల కోసం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు నాలుగో తరగతి స్టడీ సర్టిఫికెట్‌, ఇంటర్‌ ప్రవేశం కోసం ఆధార్‌ కార్డు, ఎస్‌ఎస్‌సీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్‌తో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

వైభవంగా పల్లకి సేవ

రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. పల్లకిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఈఓ నరసయ్య, ఆలయ చైర్మన్‌ జగదీశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లిక, శ్రీనివాసుల రెడ్డి, జయలక్షుమ్మ, సింగిల్‌ విండో చైర్మన్‌ బాలనాగిరెడ్డి, సీనియర్‌ అసిస్టెంట్‌ రామమోహన్‌, భక్తులు స్వాములకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి


పాల్గొన్న అధికారులు

కమలాపురం : నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ, నియోజకవర్గ స్పెషలాఫీసర్‌ యదుభూషణ్‌రెడ్డి, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రవీంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో గురువారం నియోజవర్గంలోని వివిధ శాఖల అధికారులతో వారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కొన్ని రోజులుగా అభివృద్ధి పనుల్లో కొంత వరకు వేగం తగ్గిందన్నారు. ప్రతి అధికారి భాధ్యతగా పనిచేసి తమ పరిధిలోని అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు. వివిధ పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులను కూడా మంజూరు చేసిందని, మిగిలి వున్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులను వెంటనే పూర్తి చేసి పాఠశాలలు తెరిచే నాటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి ప్రతి విద్యార్థికి పుస్తకాలతో పాటుగా యూనిఫాం అందించడానికి చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కమలాపురం, చెన్నూరు, చింతకొమ్మదిన్నె మండలాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వెనుకబడి వున్నాయని, ఆయా మండలాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వంద శాతం నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నియోజవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మ్యాజిక్‌తో మూఢ నమ్మకాలపై అవగాహన

కడప కల్చరల్‌ : మ్యాజిక్‌ ద్వారా మూఢ నమ్మకాలను గుర్తించగలిగే అవగాహన లభిస్తుందని జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి, మెజీషియన్‌ సమీర్‌ బాష తెలిపారు. గురువారం కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బాబాలు, మంత్రగాళ్ల పేరిట ప్రజల్లోని మూఢ నమ్మకాలను బలహీనతలుగా మార్చి సొమ్ము చేసుకునే మోసగాళ్లు పెరిగిపోతున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఇలాంటి పరిణామాలు సమాజానికి ప్రమాదకరంగా పరిణమిస్తాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా పిల్లల చేత కొన్ని మ్యాజిక్‌ అంశాలు చేయించారు. చిన్నారులు వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. సైన్స్‌ వెనుకగల శాస్త్రీయమైన అంశాలను వివరించారు. రిటైర్డ్‌ లైబ్రేరియన్‌ జేమ్స్‌ పిల్లలకు పలు నీతి కథలు చెప్పారు. వారిచే కథల పుస్తకాలు చదివించారు. రీసోర్స్‌ పర్సన్లు అభ్యుదయ గీతాలను విద్యార్థులకు నేర్పి పాడించారు. శిబిరంలో వివిధ పాఠశాలల విద్యార్థులు 55మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ లైబ్రేరియన్‌ నాదెండ్ల బాల్జీ, లైబ్రేరియన్‌ సుబ్రమణ్యం, రికార్డ్‌ అసిస్టెంట్‌ సుబ్బమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో శాస్త్రీయ పరిజ్ఞానం


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.మనోహర్‌

కడప కల్చరల్‌ : వేసవి శిక్షణా శిబిరాలతో విద్యార్థులకు శాస్త్రీయమైన పరిజ్ఞానం లభిస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.మనోహర్‌ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్కే నగర్‌లోని ఉర్దూ పాఠశాలలో కొనసాగుతున్న ఈ శిబిరానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం కలిగి ఉండాలని, దాన్ని చేరుకునేందుకు క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకునేందుకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడగలవన్నారు. సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం, ప్రజా నాట్య మండలి నాయకులు డాక్టర్‌ చంద్రప్రసాద్‌, జేవీవీ నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో ఇంత నాగరికంగా ఎదిగినా ఇంకా మూఢాచారాలు రాజ్యమేలు తుండడం శోచనీయమన్నారు. చదువుతోనే మూఢ నమ్మకాల నుంచి దూరం కావచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలు అభ్యుదయ గీతాలను విద్యార్థులకు నేర్పి ఆలపింపజేశారు. జిల్లా కమిటీ కోశాధికారి సమీర్‌బాష కొన్ని మ్యాజిక్‌ అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. జేవీవీ సభ్యులు వెంకటేశ్వర్లు పిల్లలకు రసాయనశాస్త్రం గురించి ఆసక్తికరమైన అంశాలను వివరించారు. ఐద్వా నాయకులు ఐఎన్‌ సుబ్బమ్మ, లక్ష్మీదేవి, ఇతర కళాకారులు ఆడిపాడి విద్యార్థులను అలరించారు.

చౌడేశ్వరీదేవికి ఘనంగా పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ చౌడేశ్వరీ మాత


పూజల్లో పాల్గొన్న మహిళలు

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తితో బాటు ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

వైభవంగా సూర్యప్రభ వాహనసేవ


సూర్యప్రభ వాహన సేవపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నరసింహస్వామి సూర్యప్రభ వాహన సేవలో కొలువై భక్తులకు దర్శనమించారు. ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో శాంతి హోమం, సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్‌ సేవ, ఊంజల్‌ సేవ, రాత్రి గరుడ సేవ వంటి కార్యాక్రమాలు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్‌ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

నేడు స్వామివారి కల్యాణం, చక్రస్నానం

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం 9 గంటలకు వైభవంగా కల్యాణం, మధ్యాహ్నం చక్రస్నానం, గజవాహన సేవ, సాయంత్రం ధ్వజఅవరోహణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రామాపురం క్షేత్రంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో మోక్షనారాయణస్వామి

కమలాపురం : మండల పరిధిలోని శ్రీరామాపురం పుణ్యక్షేత్రంలో శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి, సంజీవిని సహిత శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన గురువారం అశ్వ వాహనంపై కొలువుదీరిన మోక్షనారాయణస్వామి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ మాడ వీధుల్లో మేళతాళాలతో, భాజా భజంత్రీలతో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై కొలువు దీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి వార్లకు అర్చనలు, రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ హోమాలను నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.

నేటి నుంచి పోతులూరయ్యస్వామి ఊరేగింపు


జాతర జరిగే ఆలయం

చెన్నూరు : స్థానికంగా వెలసిన ఎల్లమాంబ జాతర ఈనెల 26వ తేదీన ఆదివారం నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎల్లమ్మతల్లి సోదరుడైన పోతులూరయ్యస్వామి ఈనెల 24వ తేదీ శుక్రవారం నుంచి మూడు రోజులపాటు చెన్నూరులో ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి బియ్యం, బేడలు, పసుపు కుంకుమ సేకరిస్తారు. సేకరించిన పసుపు కుంకుమలను మూడవరోజు ఆదివారం సాయంత్రం చెన్నూరు పోలయ్యగారివీధి నుంచి పోతులూరయ్యస్వామిని రెడ్డివీధి, బ్రాహ్మణ వీధి, పార్కువీధి, పాతబస్టాండు, మెయిన్‌ రోడ్డు మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, విజిలెన్స్‌, సివిల్‌ ఇతర పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వైభవంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు


ప్రత్యేక పూజలందుకొంటున్న సాయిబాబా

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్‌.పాలగిరి క్రాస్‌ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన, సాయిబాబా ఆలయం, సంగాలపల్లె గ్రామంలోని గో సంరక్షణ శాల, పాయసంపల్లె, గంగిరెడ్డిపల్లె, పోచంరెడ్డిపల్లె గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబా ఆలయం, కాశిరెడ్డినాయన ఆలయంలోని మూల మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. అలాగే సంగాలపల్లె గోశాలలోని గోమాతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. గోశాల ప్రాంగణంలోని కృష్ణాలయంలో భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు కాశిరెడ్డినాయన ఆలయంలో జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎస్‌.వెంకటకిషోర్‌శెట్టి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గోశాలలో నిర్వాహకులు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.